# శ్రీ గీతామకరంద

## ప్రశ్నోత్తర పుష్పమాలిక





పునర్ముద్రణ :

**శ్రీ సీతారామ సేవా సదన్**

మంథని, పెద్దపల్లి జిల్లా.

సెల్ : 8096024731

# శ్రీ గీతామకరంద

## ప్రశ్నోత్తర పుష్పమాలిక



సంకలనము - సమర్పణము


**శ్రీమతి సుజాతా ఆంజనేయులు**

**"శ్రీ సాయి కృప"**

31-9-8/12, మారుతీనగర్, విజయవాడ-520 004.

ఫోన్ : 0866-243 4788

# శ్రీ గీతామకరంద
## ప్రశ్నోత్తర పుష్పమాలిక


ప్రథమ ముద్రణ : 2011

**శ్రీమతి సుజాతా ఆంజనేయులు గారితో**

రెండవ ముద్రణ : 2021

**శ్రీ సీతారామ సేవాసదన్ వారిచే పునర్ముద్రణ**

**(శ్రీమతి సుజాతా ఆంజనేయులు గార్ల అనుమతితో)**

ప్రతులు : 1000

మూడవ ముద్రణ : 2022

**శ్రీ సీతారామ సేవాసదన్ వారిచే పునర్ముద్రణ**

**గౌ॥ అధ్యయన భారతి-శివపరివారము బెంగుళూర్ సభ్యుల వారి యోగ దానముతో**

ప్రతులు : 1000

అమూల్యం

ప్రకాశకులు :

*(ప్రతుల కొరకు క్రింద ఉన్న అడ్రస్‌లో
సంప్రదించిన మీకు అమూల్యముగా పంపబడును.)*

**శ్రీ సీతారామ సేవాసదన్**

తమ్మిచెలువుకట్ట, మంథని-505 184,
పెద్దపల్లి జిల్లా, తెలంగాణ.
సెల్ : 8096024731

ముద్రణ : **ప్రొ॥ జక్కని ప్రభాకర్**

**సత్యనారాయణ ప్రింటర్స్**

4-6-143, తిలక్‌రోడ్, కరీంనగర్.

సెల్ : **98663 95537**



మూలగ్రంథము :

# శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామి వారి

# గీతామకరందము



బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం ।
ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యం ॥
ఏకం నిత్యం విమలమచలం సర్వధీ సాక్షిభూతం ।
సాయినాథం త్రిగుణరహితం సద్గురుం తం నమామి ॥

## గీతా విశిష్టత

గీతను

| చెప్పినది | వినినది | వ్రాసినది |
|---|---|---|

## శ్రీకృష్ణ పరమాత్ముడే

ఎట్లన : పాణ్డవానాం ధనంజయః

(పాండవులలో అర్జునుడను నేను) (భ.గీ. 10-37)

మునీనామప్యహం వ్యాసహః

(మునులలో శ్రీవేదవ్యాసుడను నేను) (భ.గీ. 10-37)

అని భగవానుడే చెప్పెను

## అదృష్ట సంఖ్య - 18

| | | |
|---|---|---|
| మహాభారతములోని పర్వములు | - | 18 |
| గీతయందలి అధ్యాయములు | - | 18 |
| యుద్ధములోని సైనిక సంఖ్య (అక్షౌహిణులలో) | - | 18 |
| మహాభారత యుద్ధము జరిగిన రోజులు | - | 18 |

అక్షౌహిణి అనగా

| | | | | |
|---|---|---|---|---|
| 21,870 | ఏనుగులు | (2+1+8+7+0) | - | 18 |
| 21,870 | రథములు | (2+1+8+7+0) | - | 18 |
| 65,610 | గుఱ్ఱములు | (6+5+6+1+0) | - | 18 |
| 1,09,350 | కాల్బంట్లు | (1+0+9+3+5+0) | - | 18 |

## మోక్ష సౌధ సోపానములు

| | | |
|---|---|---|
| అంతః కరణ | - 1 | |
| పంచ ప్రాణములు | - 5 | |
| జ్ఞానేంద్రియములు | - 5 | - 18 |
| కర్మేంద్రియములు | - 5 | |
| దేహము | - 1 | |
| దృశ్యము | - 1 | |

## ఏక శ్లోకీ గీత

యత్ర యోగీశ్వరః కృష్ణో యత్ర పార్థో దనుర్ధరః।
తత్ర శ్రీ ర్విజయో భూతి ర్ధ్రువా నీతి ర్మతి ర్మమ॥

ఎక్కడ యోగీశ్వరుడైన శ్రీ కృష్ణుడు ఉండునో అక్కడ నరుడు ధనుర్ధారియై ఉండును. అక్కడ లక్ష్మి, విజయము, సర్వసిద్ధిత్వము ఉండును. ఇందు సంశయము లేదు. ఇది నిజము అని సంజయుడు చెప్పుచున్నాడు.

(భ.గీ. 18-78)

## గీతా సారం

కురుక్షేత్రం - హృదయం

శ్రీ కృష్ణుడు - బుద్ధి: అర్జునుడు - మనసు

కౌరవులు - దుర్గుణములు: పాండవులు - సద్గుణములు


అస్త్రశస్త్రములు - ఇంద్రియములు

బోధ - కర్తవ్య నిర్వహణము

ఫలితము - ఆనందమయజీవనము




# అమ్మ దీవెన




తనకు తాను ఆనందించటం స్వార్థం. ఆ ఆనందాన్ని పదిమందికీ పంచటం పరమార్థం. అట్టి పరమార్థతత్త్వాన్ని పూర్వజన్మ సుకృతంగా పొందిన జన్మమే చి॥సౌ॥ "సుజాత". పూజ్యులు శ్రీనారాయణ గురూజీ గారి ఆదేశానుసారం ఆశీర్వాద ప్రసాదంగా శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామి వారి గీతామకరందాన్ని గ్రోల గలిగే అవకాశం, అనుభూతి పొందగలిగింది.

ఈ తల్లి ఆ అవకాశాన్ని, అనుభూతిని అందరూ పొందాలనే ఆకాంక్షతో ఈ సమర్పణాకార్యాన్ని తలపెట్టింది. సత్కార్యానికి సద్గురువు సత్ఫలితాన్నే అందిస్తారనడానికి నిదర్శనమే మీ చేతిని అలంకరించిన ఈ చిన్ని పొత్తము.

ఆలసించక ఈ అమృతాన్ని మీరూ తనివి తీర, సేవించి తీరం చేరండని ఆశీర్వదిస్తోంది. "శ్రీ సాయీకృప"



ఇదే **అమ్మదీవెన**



# దివ్య ప్రసాదము

**సుజాత ! భక్తి పారిజాత !!**

ఆధ్యాత్మ జ్యోతి అయిన సాయి మాత అన్నపూర్ణమ్మ గారు వెలిగించిన దీపములలో సౌమ్యమైన సద్భావయుతమైన అందమైన దీపము సుజాత.

సాయి మాత ద్వారా పరిచయమైన సుజాత హైదరాబాదులో కలిసిన సమయం ఒక దివ్య సంఘటన. అనుకోకుండా జరిగిన కారు యాక్సిడెంటు వలన ఆమె రెస్టు తీసుకుంటున్న సమయము.

అప్పుడు ఆమె గీతా యోగము స్వీకరించి 18 రోజుల స్వాధ్యాయము, తపస్సు, ఆహారనియమములు పాటించి పూజ్య గురువులు శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానంద గిరి స్వామి వారి గీతామకరందములో వున్న 18 అధ్యాయములు అధ్యయనము చేసినారు.

ఆ మకరందమే ఆమెకు భౌతిక, మానసిక, బౌద్ధిక, ఆధ్యాత్మిక ఔషధము అయనది. తనకు లభించిన మకరందాన్ని అందరికీ దివ్య ప్రసాదముగా పంచుకోవటానికి చేసిన ప్రయత్నమే ఈ **"గీతామకరంద ప్రశ్నోత్తర పుష్పమాలిక"**

ఈ మాలికను అల్లటములో సాయి మాత అన్నపూర్ణమ్మ గారి అవ్యాజ ప్రేమ ఆశీర్వచన బలము సుజాతగారికి శక్తినిచ్చాయి. ఈ చిన్న గ్రంధములో అమూల్యమైన చైతన్య శక్తియున్నది (All in Small). భక్తులందరికీ దివ్యానుభూతి ఈ గ్రంధము ద్వారా కాగలదు. సుజాత గారి సాధన పరిపక్వము చెంది సిద్ధియై సేవా స్వరూపమంద కలదు.

**నమస్తే**

**నారాయణ**

శ్రీ ఖరనామ సంవత్సర ఉగాది
ది. 04-04-2011, బరోడా



# ప్రేరణ

2003 వ సంవత్సరములో శ్రీ సాయి కృప వలన విజయవాడ, మారుతీనగర్ నందలి సాయి కృప లోనికి ప్రవేశించగల్గాను. ఆరోజునుండి సాయి నన్ను ప్రతి విషయంలో చేయి పట్టి నడిపిస్తున్నారు. నాకు 2010, జూలైలో యాక్సిడెంట్ జరిగి 4నెలలు కదలలేని పరిస్థితులలో ఉండగా శ్రీ సాయి కృప ద్వారా పూజ్యులు శ్రీ నారాయణ గురూజీ దర్శన భాగ్యం కలిగినది. నేను హైదరాబాదు నుండి విజయవాడ వస్తున్న సమయంలో గురూజీ, శ్రీశ్రీశ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామి, వారి "గీతామకరందము" అను గ్రంథము నా చేతిలో పెట్టి "ఇది పారాయణ చేయమ్మా మంచి జరుగుతుంది" అన్నారు.

శ్రీ సాయినాధుని కరుణ వలన నేను వికృతినామ సంవత్సర కార్తీక శుద్ధ పాడ్యమి నుండి గీతామకరందము పారాయణ చెయ్యటము మొదలు పెట్టినాను. రోజుకు ఒక అధ్యాయము చొప్పున 18 అధ్యాయములు పారాయణము చేయ గలిగినాను. ఈ గ్రంథము చదివిన తరువాత ఈ గీతా మకరందము లోని ప్రశ్నలు జవాబులు ఒక పుస్తకముగా తయారు చేసినచో భగవద్గీత చదువని చదువుటకు సమయం లేని వారికి ఉపయోగపడుతుందేమో నన్న ఉద్దేశ్యముతో వాటిలో కొన్నింటిని సంకలనము చేయుటము జరిగినది. ఈ పుస్తకము చదివిన వారు అందరు శ్రీ కృష్ణ పరమాత్మ యొక్క కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాను.

నా ఈ చిన్ని ప్రయత్నంలో సహకరించి ప్రోత్సహించిన
"శ్రీ సాయీ కృప అమ్మ" ఆశీస్సులతో.

**శ్రీ సాయీ పాద రేణువు**

**సుజాత**

ఓం శ్రీ సాయినాథాయనమః

# శ్రీ గీతామకరంద ప్రశ్నోత్తర పుష్పమాలిక

1. జీవుడెవరు ?

జ. ఆత్మయే కాని దేహము కాదు.

2. ఆత్మ యెట్టిది ?

జ. ఎల్లపుడు ఉండునది

3. ఈ సత్యము కొందరికి మాత్రమే అన్వయించునా ?

జ. అన్ని జీవులకు అన్వయించును.

4. జీవికి ఎన్ని అవస్థలు ? అవి ఏవి ?

జ. జీవికి 4 అవస్థలు. అవి బాల్య, యవ్వన, వార్ధక్య దేహాంతర ప్రాప్తులు.

5. ధీరుడెవరు ?

జ. బాల్య యవ్వనాదులందు వలె మరణ, దేహాంతర ప్రాప్తులు సంభవించినపుడు ఏ మాత్రము దుఃఖింపని వాడు.

6. శీతోష్ణాదులు తటస్థించినపుడేమి చేయవలెను ?

జ. సమదృష్టితో వానిని సహించుకొని, ధైర్యముగ నుండవలెను.

7. మోక్షము అనగా నేమి ?

జ. శాశ్వత ఆనంద పదవియే మోక్షము.

8. దానిని ఎవరు పొందగలరు ?

జ. సుఖదుఃఖములయందు సమభావము కల్గినవారు మోక్షము పొందగలరు.

9. తత్వ జ్ఞానులెట్టి అనుభవమును కలిగి ఉందురు ?

జ. (నామ రూపాత్మకమగు) దృశ్య ప్రపంచమును లేని దానిని గాను సచ్చిదానంద పరమాత్మను మాత్రమే కలదానిని గాను వారు చూచుచుందురు.

10. దేహము యొక్క స్వభావమేమి ?

జ. అది నాశవంతమయినది.

11. ప్రపంచమున పూర్ణానందము ఎచట లభించును ?

జ. తన ఆత్మనందే.

12. స్థిత ప్రజ్ఞుని లక్షణములను పేర్కొనుము ?

జ. దుఃఖములందు క్షోభనొందకుండుట, సుఖము లందు ఆసక్తి లేకుండుట, రాగ, భయ, క్రోధములు లేకుండుట.

13. ఇంద్రియముల శక్తి యెట్టిది ?

జ. మోక్ష మార్గమున యత్నించుచున్న విద్వాంసుని మనస్సును గూడ బలత్కారముగ లాగి విషయముల వైపుకు పడద్రోయ గలదు.

14. ఎవరి జ్ఞానము స్థిరముగ ఉండగలదు ?

జ. సర్వేంద్రియ నిగ్రహము కలవాని యొక్క జ్ఞానము స్థిరముగ ఉండగలదు.

15. జీవుని వినాశ హేతుమేమి ?

జ. విషయచింతన.

16. అది ఏ ప్రకారముగ జీవుని పడద్రోయును ?

జ. విషయచింతనచే విషయసంగమేర్పడును. దానిచే కామము, కామముచే క్రోధము, క్రోధముచే మోహము, మోహముచే విస్మృతి, విస్మృతిచే బుద్ధి నాశనము, బుద్ధినాశముచే అధోగతి ప్రాప్తి సంభవించుచున్నది.

17. సుఖము దేనివలన కలుగును ?

జ. శాంతిచే.

18. శాంతి దేనివలన కలుగును ?

జ. ఆత్మచింతనచే.

19. ఆత్మచింతన దేనివలన కలుగును ?

జ. నిర్మల బుద్ధిచే.

20. నిర్మల బుద్ధి దేనివలన కలుగును ?

జ. ఇంద్రియ నిగ్రహము వలన, మనస్సంయమనము వలన, విషయ విరక్తి వలన.

21. అజ్ఞానికి - జ్ఞానికి గల భేధమేమి ?

జ. అజ్ఞాని - విషయ భోగములందు సదా ప్రవర్తించును. జ్ఞాని - విషయ భోగములందు విరక్తి కలిగియుండును.

22. బ్రహ్మస్థితి ఎప్పుడు కలిగియుండవలెను ?

జ. బాల్య యవ్వనము నందును, అంత్యకాలమందు కూడా.

23. అందువలన కలుగు ప్రయోజన మేమి ?

జ. జీవుడు బ్రహ్మానంద రూపమగు మోక్షము బొందును.

24. పూర్వము భగవానుడు జనులు తరించుటకు ఎన్ని మార్గములు బోధించెను అవి ఏవి ?

జ. రెండు మార్గములు :- జ్ఞానయోగము, కర్మయోగము.

25. మోక్షము దేనివలన చేకూరదు ?

జ. చిత్తశుద్ధిలేక కర్మాచరణ చేయుట వలన, బాహ్య సన్యాసము వలన మోక్షము లభించదు.

26. మోక్షము దేని వలన చేకూరును ?

జ. నిష్కామ కర్మాచరణము వలన క్రమముగ మోక్షము సంప్రాప్తించును.

27. మిధ్యాచార మనగానేమి ?

జ. ఇంద్రియములను మాత్రము అణచి పెట్టి మనస్సుతో ముల్లోకము లందును సంచరించుట, విషయములను స్మరించుట మిధ్యాచారము (డంబాచారము) అగును.

28. కర్మ చేయుట మేలా ? చేయకుండుట మేలా ?

జ. చేయుటయే మేలు.

29. ఎట్టి కర్మ చేయవలెను ?

జ. శాస్త్ర సమ్మతమగు కర్మ చేయవలెను.

30. కర్మ చేయనిచో కలుగు హాని ఏమి ?

జ. చిత్తశుద్ధి కలుగదు. చిత్తశుద్ధి లేనిచో 1. జ్ఞానము అంకురింపదు. జ్ఞానము లేనిచో మోక్షము సిద్ధింపదు. 2. కర్మ చేయనిచో దేహయాత్ర కూడ కొనసాగదు.

31. ఎట్టి కర్మ బంధనము కలుగ చేయదు ?

జ. భగవత్ప్రీతి కరమైన, పరోపకారార్థమైన కర్మ బంధనమును కలుగజేయదు. దానిని ఫలాపేక్ష లేక ఆచరింపవలెను.

32. బ్రహ్మదేవుడు ప్రజలను సృష్టించునపుడు వారితోసహ మరి దేనిని సృష్టించెను.?

జ. యజ్ఞములను (సత్కార్యములను, దైవకార్యములను)

33. వాని వలన ప్రయోజనమేమి ?

జ. అవి జీవునకు ఆధ్యాత్మికాభివృద్ధిని కలుగ జేసి, అతనికి శాంతి సుఖములను మోక్షమును చేకూర్చును.

34. యజ్ఞము అనగా నేమి ?

జ. ఫలాపేక్ష రహిత సత్కర్మలే యజ్ఞమనబడును.

35. యజ్ఞములచే ఆరాధింపబడి భగవంతుడు జనులకేమి ఒసంగును?

జ. వారికి ఇష్టమైన అన్నాది భోగ్య పదార్ధముల నిచ్చును.

36. అవి లభించినపుడు జీవుడు ఏమి చేయవలెను ?

జ. వెంటనే ఆయా దేవతలకు నివేదన చేయవలెను.

37. అట్లు చేయక అనుభవించినచో కలుగు నష్టమేమి ?

జ. అతడు దొంగ క్రింద పరిగణింప బడి తగు శిక్ష అనుభవించ వలసి వచ్చును.

38. యజ్ఞశేషమును (దైవార్పితము చేయగ మిగిలిన దానిని) భుజించు వారికి కలుగు ఫలితమేమి ?

జ. సర్వ పాపముల నుండి విముక్తులగుదురు.

39. అట్లు కాక, స్వార్ధము కొఱకు భుజించు వారికి కలుగు ఫలితమేమి ?

జ. వారు పాపమునే పొందుదురు, పాపరూపులే అగుదురు.

40. యజ్ఞములెందుకు పవిత్రమైనవి ?

జ. వాని యందు సర్వవ్యాపక బ్రహ్మము ప్రతిష్ఠితమైయున్నది. కావున వాని నాచరించుట ద్వారా జీవునకు క్రమముగ బ్రహ్మము యొక్క సాక్షాత్కారము సిద్ధించగలదు.

41. కర్మ యోగమును గూర్చిన విధి ఎవరికి లేదు ?

జ. ఆత్మారాములు, ఆత్మతృప్తులు, ఆత్మ సంతుష్టులునగు మహానీయులకు కర్మను గూర్చిన విధిలేదు.

42. కర్మను ఏ ప్రకారము ఆచరించవలెను ?

జ. అసక్తముగ (నిష్కామముగ) ఆచరించవలెను. చేయదగిన అనగా శాస్త్ర నియతములగు కర్మలనే ఆచరించవలెను.

43. కర్మ యోగముచే ఇదివరకు ఎవరైన మోక్షము బడసిరా ? బడసినచో వారెవరు?

జ. జనకాది చక్రవర్తులు కర్మయోగము నాచరించి మోక్షము బడిసిరి.

44. కర్మ యోగమును ఆచరించుట వలన ప్రపంచమునకు కలుగు ప్రయోజనమేమి?

జ. దాని వలన అనేకులను అప మార్గము నుండి త్రిప్పి సన్మార్గమున ప్రవర్తింప జేయుటకు అవకాశము కలుగును.

45. కర్మలను ఎందులకు చేయవలెను ?

జ. లోక క్షేమము కొరకు

46. అజ్ఞానులకు ఏ ప్రకారము భోదించవలెను ?

జ. తాను ఆచరించుచూ బోధించ వలెను.

47. ప్రపంచములోని సమస్త కర్మలు దేనిచే చేయబడుచున్నవి ?

జ. ప్రకృతి జన్యములగు గుణములచే.

48. అహంకారము గల మనుజుడేమని తలంచుచున్నాడు ?

జ. తానే కర్తనని తలంచుచున్నాడు.

49. దాని ఫలితమేమి ?

జ. తత్ఫలితముగ జన్మపరంపరలను, దుఃఖమును అనుభవించుచున్నాడు.

50. ప్రకృతి గుణములకు దాసులై వర్తించు కర్మ సంగులెట్టివారు ?

జ. అల్పజ్ఞులు, మందమతులు.

51. పరమ శ్రేయమునకు మార్గమేది ?

జ. కర్మలను భగవదర్పణము గావించి, ఆశా మమకార వర్జితుడై కార్యములు ఆచరించుటయే శ్రేయో మార్గము.

52. పండితుడు అనగా నెవరు ?

జ. ఎవని యొక్క సమస్త కార్యములు కామసంకల్ప వర్జితములై ఉండునో అతడే పండితుడు.

53. వివేకవంతుడు కర్మలను ఏ ప్రకారము చేయవలెను ?

జ. ఫలాసక్తి రహితుడై చేయవలెను.

54. అనేక కార్యములనాచరించినను ఏమియు ఆచరించని వాడెవడు ?

జ. కర్మ ఫలాసక్తిని వదలిన వాడు, నిరంతరము తృప్తి గలిగిన వాడు, దేనిని ఆశ్రయించని వాడు.

55. కర్మ చేసినను పాపము నెవరు పొందకుందురు ?

జ. 1. ఆశ లేనివారు. 2. ఇంద్రియ మనంబులను స్వాధీన పరచు కొనిన వారు. 3. పరుల నుండి ఏ వస్తువును పరిగ్రహింపనివారు.

56. కార్యమును చేసినప్పటికి వానిచే ఎవరు బంధింపకుందురు ?

జ. 1. అప్రయత్నముగ లభించిన దానితో సంతుష్టి నొందువాడు. 2. సుఖ దుఃఖాది ద్వంద్వములను దాటినవాడు 3. మాత్సర్యము లేనివాడు. 4. కార్యము యొక్క సిద్ధి అసిద్ధులందు సమభావము కలవాడు.

57. యజ్ఞములలో కొన్నిటిని పేర్కొనుము ?

జ. 1. దైవ యజ్ఞము (దేవతారాధన, దైవోపాసన) 2. బ్రహ్మ యజ్ఞము (విచారణ చేతను, పవిత్రత చేతను చిత్తమును బ్రహ్మమందు (ఆత్మయందు) విలీన మొనర్చుట.)

58. మరికొన్ని యజ్ఞములను తెలుపుము ?

జ. 1. ఇంద్రియ నిగ్రహము 2. విషయ త్యాగము.

59. మనస్సు యొక్క సంయమనము దేనిచే వర్ధిల్లును ?

జ. జ్ఞానముచే, తత్త్వ విచారణచే.

60. పాపము నశించుటకు ఉపాయమేమి ?

జ. యాజ్ఞాచరణము, సత్కర్మానుష్ఠానము.

61. కర్మ సంశయము ఎట్లు తొలుగును ?

జ. జ్ఞానముచే.

62. బ్రహ్మమును ఎవరు పొందగలరు ?

జ. సత్కార్యములను ఆచరించి శేషించిన అన్నమును భుజించు వారు.

63. యజ్ఞములన్నియు ఎచట తెలుపబడినవి ?

జ. వేదములందు విస్తారముగ వర్ణించబడి యున్నవి.

64. నిష్కామ కర్మ లోకమున ఎట్లు వ్యాపించెను ?

జ. మొట్టమొదట భగవానుడు సూర్యునకు ఉపదేశింపగ, సూర్యుడు మనువునకును, మనువు ఇక్ష్వాకునకును దానిని బోధింప, క్రమముగ లోకమున వ్యాపించెను.

65. నిష్కామకర్మను అర్జునునికే ఏల ఉపదేశింప వలెను ?

జ. అతడే అర్హత గలిగిన వాడు కాబట్టి.

66. జన్మ రహితుడైన భగవంతుడు ఏల జన్మనెత్తుచున్నాడు ?

జ. లోకోద్ధరణము కొరకు మాత్రము జన్మించు చున్నాడే కాని అజ్ఞాని వలె కర్మకు వశుడై కాదు.

67. భగవంతుడు ఎపుడు అవతరించును ?

జ. ధర్మము క్షయించినపుడు, అధర్మము వృద్ధి నొందినపుడు.

68. కర్మము యొక్క ఫలితము ఏ లోకమున శీఘ్రమున కలుగును ?

జ. మనుష్యలోకమున.

69. మనుజులలో బుద్ధిమంతుడెవరు ?

జ. కర్మయందు అకర్మను, అకర్మయందు కర్మను జూడ గలుగువాడు.

70. అట్టివారు ఏ ఫలితము పొందుదురు ?

జ. క్రమముగ ఆత్మ సాక్షాత్కారమును పొందుదురు.

71. యజ్ఞము లన్నిటిలో ఏ యజ్ఞము శ్రేష్ఠమైనది ?

జ. జ్ఞాన యజ్ఞము

72. జ్ఞానము ఎవరి వలన లభించును ?

జ. అనుభవజ్ఞులగు తత్త్వవేత్తల వలన.

73. అట్టి సద్గురువుల వద్ద ముముక్షువులు ఎట్లు ప్రవర్తించవలెను. ?

జ. 1. సాష్టాంగ వందనము చేయవలెను 2. వినయముతో సమయాసమయములు చూచి ప్రశ్నించవలెను. 3. సేవ యొనర్చ వలెను.

74. జ్ఞానము పొందినచో కలుగు ఫలితమేమి ?

జ. మరల జీవుడు మోహము నందు (అజ్ఞానము నందు) పడకుండును. సమస్త ప్రాణికోటిని తన యందును, భగవంతుని యందును వీక్షింప గలుగును.

75. పాపము పోగొట్టు కొనుటకు ఉపాయమేమి ?

జ. జ్ఞానమును సముపార్జించుటయే.

76. జ్ఞానము యొక్క ప్రభావ మొట్టిది ?

జ. మహా పాపాత్ముడైనను జ్ఞానమను తెప్పచే పాపసముద్రమును దాటివేయగలడు.

77. జ్ఞానము యొక్క మహిమను నిరూపింపుము ?

జ. అది కర్మరాశులను నిర్మూలమొనర్చి జీవుని బంధవిముక్తినిగ జేయగలదు.

78. ప్రపంచములో అన్నింటి కంటెను మిగుల పవిత్ర మైన వస్తువేది.?

జ. ఆత్మ జ్ఞానము

79. అది ఎట్లు, ఎచట, ఎపుడు జీవునకు లభించును ?

జ. కర్మయోగ సిద్ధిచే తన యందే కాలక్రమమున లభించును.

80. జ్ఞానమును ఎవరు పొందగలరు ?

జ. శ్రద్ధ గలవారు, తదేక నిష్ఠతో కూడిన వారు, ఇంద్రియ నిగ్రహము లెస్సగ గలవారు.

81. ఈ ప్రపంచమున వినాశమును పొందువారెవరు ?

జ. అజ్ఞాని 2. శ్రద్ధావిహీనుడు 3. సంశయచిత్తుడు.

82. సంశయాత్మునికి ఎట్టి దుర్గతి కలుగును ?

జ. అతనికి ఇహలోక సుఖముగాని, పరలోక సుఖము గాని, మనశ్శాంతి గాని యుండవు.

83. ముముక్షువు యొక్క కర్తవ్యమేమి ?

జ. 1. అజ్ఞానమును వీడి జ్ఞానమును సముపార్జించవలెను. 2. శాస్త్ర, గురువాక్యములందు అశ్రద్ధ గలిగి యుండరాదు.

3. పరమార్ధ సత్యములందు సంశయము కలిగి యుండరాదు.

84. కర్మలు ఎవరిని బంధింపవు ?

జ. నిష్కామ కర్మ యోగముచే కర్మఫలమును త్యజించు వానిని 2. ఈశ్వరార్పణ చేయువానిని, 3. జ్ఞానముచే సంశయములు నివర్తించిన వానిని 4. ఆత్మ నిష్ఠుని కర్మలు బంధించనేరవు.

85. సంశయ మోహాదు లెచట కాపురముండును ?

జ. హృదయమున

86. అజ్ఞానమును నశింప చేసికొనిన పిదప మహానీయులు సామాన్యముగ ఏమి చేయుదురు ?

జ. లోకోపకారార్ధ నిష్కామ కర్మ యోగమును ఆచరించవలెను.

87. "నిత్య సన్యాసి" ఎవరు ?

జ. దేనిని ద్వేషింపనివాడు, దేనిని వాంఛించని వాడు, సుఖదుఃఖాధి ద్వంద్వములు లేనివాడు.

88. నిత్య సన్యాసత్త్వనకు ఫలమేమి ?

జ. దానిచే మనుజుడు సంసార బంధమును సులభముగ దాటి వేయగలడు.

89. జ్ఞానయోగ, కర్మయోగములు వేరు వేరా ?

జ. కాదు. చక్కగ ఆచరించినచో రెండును ఒకే మోక్ష రూప ఫలమును కలుగు జేయును.

90. కాబట్టి మోక్షప్రాప్తికి ఉపాయమేమి ?

జ. జ్ఞాన యోగము గాని కర్మయోగము గాని తుది వరకు చక్కగ అనుష్ఠించవలెను. అపుడు రెండింటి ఫలము మోక్షముగ లభించును.

91. నిష్కామ కర్మ వలన లభించు ఫలితమేమి ?

జ. చిత్తశుద్ధి

92. నిష్కామ కర్మయోగి ఎట్టి ఫలితమును పొందును ? ఎందుచేత ?

జ. ఫలాపేక్ష లేని కారణము చేత పరమశాంతిని పొందును.

93. కామ్య కర్మలను చేయువాడు ఎట్టి ఫలితము పొందును ? ఎందుచేత ?

జ. సంసార బంధమున లెస్సగ తగుల్కొనును ఫలాసక్తి వలన.

94. కర్మలను శరీరముచే త్యజించవలెనా ? మనస్సు చేతనా ?

జ. శరీరముతో గాదు, మనస్సు చేతనే.

95. జీవుల యొక్క ఆయా కర్మలలో భగవంతున కెంత సంబంధము గలదు ?

జ. జీవుల కర్మలతో భగవంతునకు ఏమియు సంబంధము లేదు.

96. దేని వలన జీవునకు అవి కలుగు చున్నవి ?

జ. తమ తమ జన్మాంతర సంస్కారముల వలన.

97. కర్మలు చేసినను ఏ ప్రకారముగ అంటబడకుందురు ?

జ. తామరాకుపై నీటిబొట్టు లాగున.

98. ఆత్మజ్ఞానము ఎట్లు సంప్రాప్తించును ?

జ. ఆత్మయందే బుద్ధినుంచి, ఆత్మను గూర్చియే చింతన జేయుచున్న లభించును.

99. పండితుడు అనగా నెవరు ?

జ. 1. విద్యా వినయములు గల బ్రాహ్మణునియందు 2. ఆవుయందు 3. ఏనుగునందు 4. కుక్కయందు 5. కుక్క మాంసము తిను చండాలుని యందు సమభావము గలవాడే పండితుడు, జ్ఞాని.

100. ఈ సంసారమును ఎవరు జయించుదురు ?

జ. ఎవరి మనస్సు దోషరహితమై సమభావము గలిగి యుండునో వారు జయించగలరు.

101. బ్రహ్మ వేత్తయగు మహనీయుని లక్షణము లెవ్వి ?

జ. ప్రియ వస్తువు లభించినపుడు ఉప్పొంగుట గాని, అప్రియ వస్తువు లభించినపుడు క్రుంగి పోవుట గాని లేకుండుట, స్థిర బుద్ధి కలిగి యుండుట, మోహము లేకుండుట.

102. ఆత్మ సుఖము యెట్టిది ?

జ. అక్షయమైనది.

103. అది ఎట్లు లభించును ?

జ. శబ్దాది విషయము లందు ఆసక్తి వదలి ఆత్మయందు నిష్ఠ గలిగి యుండుటచే (బ్రహ్మ యోగముచే) లభించును.

104. విషయ సుఖముల స్వభావమెట్టిది ?

జ. 1. అవి దుఃఖము లోన గలిగి యుండును. (దుఃఖ జనకములు) 2. అల్పకాల మాత్రముండును. (క్షణికములు)

105. విజ్ఞుడగు వాడేమి చేయును ?

జ. నశ్వర సుఖములయందు రమింపక ఆత్మ సుఖమునే అన్వేషించును.

106. విషయముల కొరకు పరుగిడు వాడెవడు ?

జ. ఒట్టి తెలివి తక్కువ వాడు, అజ్ఞాని.

107. బ్రహ్మ సాయుజ్యమును (మోక్షమును) ఎవరు పొందగల్గుదురు ?

జ. 1. బాహ్య సుఖములను వదలి ఆత్మయందే సుఖమును పొందువారు, 2. బాహ్య క్రీడలందాసక్తి లేక ఆత్మయందే క్రీడించువారు, 3. బాహ్య ప్రకాశమునందు దృష్టి లేక ఆత్మయందే ప్రకాశము కలవారు, మోక్షము పొందుదురు.

108. మోక్ష స్థానమును సోమరులు అందుకొనగలరా ?

జ. లేదు, యత్న శీలురు మాత్రము చేరుకొన గలరు.

109. మోక్ష ప్రాప్తికి ఉపాయములేవి ?

జ. 1. శబ్దాది విషయ త్యాగము 2. ఏకాగ్ర ధ్యానము 3. ప్రాణాయామము 4. ఇంద్రియ మనో బుద్ధుల నిగ్రహము 5. మనన శీలత్వము 6. మోక్ష పరాయణత్వము 7. కామ, క్రోధ భయరాహిత్యము.

110. భగవంతుని స్వరూపమెట్టిది ? అతడెట్టివాడు ?

జ. అతడు 1. సమస్త యజ్ఞములకు, తపస్సులకు భోక్త 2. సమస్త లోకములకు ప్రభువు, నియంత 3. సర్వ జీవులకు ఆప్త మిత్రుడు.

111. మనుజుడు యోగి ఎపుడు కాగలడు ?

జ. దేహాది దృశ్య పదార్థములను గూర్చిన సంకల్పములను వదలినపుడు మాత్రమే.

112. యోగారూఢుని లక్షణము లెవ్వి ?

జ. శబ్ద, స్పర్శాది విషయములయందు ఆసక్తి లేకుండుట, కర్మలందు ఆసక్తి లేకుండుట,

సమస్త సంకల్పములను త్యజించి ఆత్మయందు స్థితి కలిగియుండుట.

113. ఈ సంసారమున జీవుని ఉద్ధరించు వారెవరు ?

జ. తన్ను తానే ఉద్ధరించు కొనవలెను.

114. మనుజులకు బంధువెవరు ? శత్రువెవరు ?

జ. 1 తనకు తానే బంధువు 2. తనకు తానే శత్రువు.

115. యోగాభ్యాసి యెట్టి నియమములను కలిగియుండవలెను.?

జ. ఏకాంత స్థలమును ఆక్రమించవలెను, ఏకాకియై ధ్యాన మొనర్చవలెను, ఆశ లేకుండవలెను,

దేహేంద్రియ మనంబులను స్వాధీనమందుంచుకొనవలెను, ఇతరుల నుండి ఏమియు గ్రహించకుండుట.

116. ఎందుకు ధ్యానము చేయవలెను ?

జ. హృదయ శుద్ధి కొరకు, అంతఃకరణము యొక్క నిర్మలత్వము కొరకు ధ్యానము చేయవలెను.

117. ధ్యానాభ్యాసి యెట్టి లక్షణములు కలిగి యుండవలెను ?

జ. ప్రశాంత చిత్తుడై యుండవలెను, నిర్భయుడై మెలగవలెను, బ్రహ్మ చర్య వ్రతమును అవలంబించవలెను,

మనస్సును విషయముల పైకి పోనీయకుండ జాగ్రత్త వహించవలెను.

118. ధ్యాన యోగి ఆహార నిద్రాదులందెట్లు ప్రవర్తించ వలెను ?

జ. మిత నిద్రను, మితాహారమును ఆశ్రయించవలెను.

119. ఆత్మను దేనిచే చూడవలెను ?

జ. నిర్మల బుద్ధిచే

120. ఆత్మను ఎచ్చట చూడవలెను ?

జ. తన హృదయమున.

121. ఆత్మ దర్శనము వలన కలుగు ఫలితమేమి ?

జ. జీవునకు అపరిమిత ఆనందము కలుగును.

122. ప్రపంచములో అన్ని లాభముల కంటే గొప్ప లాభమేమి ?

జ. ఆత్మ లాభము.

123. సన్యాసి అనగా ఎవరు ? యోగి అనగానెవరు ?

జ. చేయదగిన కార్యములు ఫలాపేక్ష లేకుండ చేయువాడు సన్యాసి. కర్మలను త్యజించని వాడు యోగి (అగ్ని హోత్రమును వదలనివాడు)

124. ఆత్మస్థితి యందున్న వారికి గుర్తేమి ?

జ. ఎటువంటి ఘోర దుఃఖములు సంప్రాప్తించినను లవలేశమైనను చలింపడు.

125. సాధకుడు ఎట్టి బుద్ధి గలిగి యుండవలెను ?

జ. ధైర్య బుద్ధి గలిగి యుండవలెను.

126. మనస్సు యొక్క స్వభావమెట్టిది ?

జ. చంచలమైనది, నిలకడలేనిది.

127. మనస్సు ఆత్మయందు నిలవక బయటకు పరిగెత్తినచో ఏమి చేయవలెను ?

జ. ఎచటికెచటికి అది పోవునో (వివేక సహాయముచే) అచటి అచటి నుండి దానిని మరలించి తిరిగి ఆత్మయందు స్థాపించవలెను. ఆత్మకు ఆధీనము చేయవలెను.

128. యోగి ఎట్టి లక్షణములు కలిగి యుండును ?

జ. ఎల్లెడల సమదృష్టి గలవాడై సమస్త ప్రాణి కోటి యందు తనను (ఆత్మను) తనయందు (ఆత్మయందు) సమస్త ప్రాణి కోటిని గాంచును.

129. ఆత్మజ్ఞుడగు మహానీయుడు లోకమున వ్యవహరించినను అతని భగవత్స్థితికి హాని కలుగునా ?

జ. కలుగదు. అతడెట్లుప్రవర్తించినను అతని భగవత్స్థితికి లోపము కలుగుదు.

130. యోగ భ్రష్టునకు ఎట్టిగతి లభించును ?

జ. అతనికి ఈ లోకమున గాని పరలోకమున గాని దుర్గతి ఎన్నడును గలుగదు, సద్గతియే కలుగును.

131. యోగ భ్రష్టుడు మరణించిన వెనుక ఎట్టి సద్గతిని బొందును ?

జ. అతడు మొదట పుణ్య దంపతుల లోకమునకు ఏగి అట చాలా కాలము నివసించి తదుపరి సదాచారము గల శ్రీ మంతుల గృహము నందు జన్మించి తాను ఇదివరలో విడిచిపెట్టిన యోగము అచట తిరిగి కొనసాగించును.

132. ప్రపంచమున అన్ని జన్మలకంటెను శ్రేష్ఠమగు జన్మమేది ?

జ. ధీమంతులగు (జ్ఞానసంపన్నులగు) యోగుల కుటుంబము నందు జన్మించుట.

133. అట్లు యోగుల వంశమందు జన్మించి సాధకుడు ఏమి చేయవలెను ?

జ. పూర్వము తాను అసంపూర్తిగ వదలిన యోగమును పూర్ణసిద్ధి కలుగు వరకు కొనసాగించవలెను.

134. ఆధ్యాత్మ విజ్ఞానము యొక్క మహిమ యెట్టిది ?

జ. దానిని తెలిసికొనినచో సమస్తము తెలియబడినట్లే అగును.

135. ఈ సమస్త జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయములకు కారణభూతుడెవరు ?

జ. పరమాత్మయే.

136. జగత్తు యొక్క వాస్తవ స్వరూప మెట్టిది ?

జ. పరమాత్మ కంటె వేరుగ ఈ జగత్తునందు ఏ పదార్థమున్నూ లేదు.

137. జగత్తునందు పరమాత్మ ఏ ప్రకారము వ్యాపించియున్నాడు ?

జ. మణుల యందు దారమువలె.

138. పరమాత్మ ఎట్టివాడు ?

జ. సత్వ, రజ, తమో గుణ సంజనీతములగు సమస్త వస్తువులకును ఆధార భూతుడు. అవి అతనికి వశమై ఉన్నవి.

139. మాయను దాటుట ఎట్లు ?

జ. భగవంతుని శరణు బొందువారు, ఆ మాయా సముద్రమును దాటి వేయగలరు.

140. మనుజుని జ్ఞానమును (వివేకమును) అపహరించివేయు దొంగ ఎవరు ?

జ. మాయ

141. లోకములో మహాత్ముడు అనదగిన వాడెవడు ?

జ. జ్ఞానియే.

142. భక్తి శ్రద్ధలతో దేవతలను ఉపాసించు వారికి భగవానుడు ఎట్టి సహాయము చేయును ?

జ. వారికి ఆయా దేవతల యందు గల శ్రద్ధాసక్తులను స్థిర పరచును.

143. తత్ఫలితముగ అతడేమి పొందును ?

జ. తన అభీష్ట ఫలములను వారి వలన పొందును.

144. ఆ ఫలములను ఎవరు నిర్ణయించిరి ?

జ. దేవ దేవుడగు పరమాత్మయే. కావున అతడే ఆయా దేవతల ద్వారా వారివారి వాంఛితములను ఒసగినట్లగును.

145. దేవతారాధకులు దేనిని పొందుదురు ? పరమాత్మను అర్చించు వారు ఎట్టివారు?

జ. దేవతారాధకులు ఆయా దేవతలను, భగవతారాధకులు భగవంతుని (ఆత్మసాక్షాత్కారమును) పొందుదురు.

146. భగవంతుడు చిన్న దేహమే అని తలంచువారు ఎట్టివారు ?

జ. అవివేకులు

147. విజ్ఞుడగు వాడేమి చేయవలెను ?

జ. తనకు భగవంతునకు మధ్య అడ్డు గోడగ నిలిచియున్న మాయా రూపావరణమును శీఘ్రముగ (ఈ జన్మయందే) ప్రయత్న పూర్వకముగా ఆధ్యాత్మ సాధనలచే తొలగించి వేసి భగవత్ సాక్షాత్కారము పొందవలెను.

148. సమస్త ప్రాణులు అజ్ఞానము నెపుడు పొందుచున్నవి ?

జ. పుట్టుకతోనే.

149. భగవానుని ఎందులకు ఆశ్రయించవలెను ?

జ. జన్మ, మరణ రూప సంసార బంధ విచ్ఛితి కొరకై.

150. దేహ వియోగ సమయమందును ఎవరు నియమిత చిత్తులై ఆత్మానుభవము గలిగియుందురు ?

జ. ఎవరు పెక్కు సాధనల ద్వారా జీవితకాలమంతయు యత్నించి పరమాత్మాను భవమును సంపాదించుకుందురో వారు.

151. ఆది భూతమనగా నేమి ?

జ. నశించు పదార్థమే (సమస్త దృశ్య సముదాయమే) ఆదిభూతమనబడును.

152. ఆది దైవతమనగా నేమి ?

జ. విరాట్ పురుషుడగు, లేక హిరణ్య గర్భుడే ఆది దైవత మందురు.

153. ఆది యజ్ఞుడెవ్వడు ?

జ. ఈ దేహమందు సాక్షాత్తు పరమాత్మయే ఆది యజ్ఞుడు.

154. జీవుడు అంత్య కాలమందు గూడ ఎట్టి భావము కలిగి యుండవలెను ?

జ. దైవమునే స్మరించుచు ఇతర భావనలు యేమియు లేకుండవలెను.

155. దాని ఫలితమేమి ?

జ. దానిచే నతడు పరమాత్మ స్వరూపమే పొందుచున్నాడు.

156. జీవుడు మరణానంతరము ఏ రూపము పొందును ?

జ. మరణకాలమున యే భావమును స్మరించునో లేక రూపము గూర్చి భావించునో ఆ రూపమునే పొందును.

157. అంత్యకాలమున దైవ సంస్కార మెట్లేర్పడగలదు ?

జ. జీవితమంతయు దైవస్మరణ, దైవ చింతనాదులను గావించుట వలన.

158. దేవుని ఎపుడు స్మరించవలెను ?

జ. ఎల్లకాలమందు, మాటి మాటికి స్మరించవలెను.

159. అట్లు నిరంతరము దైవ చింతన చేయవలసి ఉండిన ఇక జీవిత నిర్వహణ ఎట్లు జరుగును ?

జ. దైవస్మరణ చేయుచు వారివారి వృత్తులను కార్యక్రమములను ధర్మ పూర్వకముగ జరుపుకొనవచ్చును.

160. భగవంతుని పొందుటకు ఉపాయమేమి ?

జ. వారివారి మనో బుద్ధులను భగవంతునకు అర్పించుటయే.

161. జన్మము ఎవరు పొందకుందురు ?

జ. భగవంతుని పొందిన మహనీయులు.

162. భగవత్సాయుజ్య మెట్టిది ?

జ. సర్వోత్తమముగు పదవి.

163. బ్రహ్మలోకము వరకు గల సమస్త లోకముల యొక్క స్వభావమేమి ?

జ. పునరావృత్తి (అచటికి బోయిన వారికి మరల జన్మము కలుగును.)

164. బ్రహ్మదేవుని పగలు రాత్రి ఎంతెత కాల పరిమాణము గలిగి యున్నవి ?

జ. ఒక్కొక్కటి వేయి మహాయుగముల కాలము గలిగి యున్నది.

165. ఈ సమస్త జగత్పదార్థములు దేని నుండి పుట్టుచున్నవి ?

జ. అవ్యక్తము నుండి (అవ్యక్తము - మూల, ప్రకృతి, మాయ)

166. ఎప్పుడు పుట్టును ?

జ. బ్రహ్మదేవుని పగలు ప్రారంభమయినపుడు.

167. ఎపుడు లయించును ? ఎచట లయించును ?

జ. బ్రహ్మ దేవుని రాత్రి ప్రారంభ మగునపుడు లయించును. ఎచట పుట్టుచున్నదో ఆ అవ్యక్తమందే తిరిగి లయించుచున్నది.

168. జీవులగతి ఎట్లుండును ?

జ. వారు సృష్టి ఆరంభమున పుట్టుచు, జల ప్రళయమందు లయించుచు నుందురు.

169. దేనిని పొందినచో జీవుడు తిరిగి జన్మాదులను పొందకుండును ?

జ. పరమాత్మను.

170. బ్రహ్మవేత్తలు ఏ మార్గము గుండా పోవుదురు ?

జ. 1. అగ్ని 2. ప్రకాశము 3. పగలు 4. శుక్లపక్షము 5. ఉత్తరాయణము అను ఐదున్ను గలిగియున్న మార్గము గుండా పోవుదురు.

171. బ్రహ్మవేత్తలు దేనిని బొందుదురు ?

జ. బ్రహ్మమునే పొందుదురు.

172. భగవంతుని ఎవరు ఆశ్రయింపరు ?

జ. పాపులు, మూఢులు, నరాధములు, అసుర స్వభావము నాశ్రయించువారు.

173. సకామ కర్మ యోగి (లేక అజ్ఞాని) ఏ మార్గము గుండా చనును ?

జ. పొగ, రాత్రి, కృష్ణ పక్షము, దక్షిణాయనము - అనునవి కల అంధకార మార్గము గుండా చనును.

174. అతనికి జన్మ రాహిత్యము కలుగునా ?

జ. కలుగదు. అతను జన్మించియే తీరును.

175. ప్రపంచములో జన్మరాహిత్యమునకు ఎన్ని మార్గములు కలవు ? అవి ఏవి ?

జ. రెండే మార్గములు కలవు. 1. ప్రకాశమగు ఉత్తరాయణ మార్గము 2. అంధకారమగు దక్షిణాయన మార్గము.

176. విజ్ఞుడగు వాడు ఏమి చేయవలెను ?

జ. మొదటిది యగు ప్రకాశ మార్గము ననుసరించి రెండవది యగు అంధకార మార్గమును త్యజించవలెను.

177. ఈ జ్ఞానమును బొందుట వలన గలుగు ఫలితమేమి ?

జ. ఈ జ్ఞానమును బొందుటచే జనులు 1. భగవంతునితో ఐక్యమొందిన వారై భగవత్స్వరూపులే యగుదురు. 2. మరియు సృష్టికాలమందు జన్మించరు. ప్రళయ కాలమందు నాశమొందరు. బాధితులు కారు. (జనన, మరణ రహితులగుదురు.)

178. సమస్త ప్రాణులు ఏ ప్రకారము ఆవిర్భవించు చున్నవి ?

జ. ప్రకృతి, పురుషుల సంయోగము వలన.

179. సత్త్వ గుణ మెట్టిది ?

జ. 1. నిర్మలమైనది 2. ప్రకాశింపజేయునది. 3. ఉపద్రవము లేనిది.

180. అయితే అది ఏ ప్రకారము జీవుని బంధించు చున్నది ?

జ. (ఇంద్రియ) సుఖాసక్తి చేతను (వృత్తి) జనాసక్తి చేతను బంధించుచున్నది.

181. కావున ఫలితాంశ మెట్టిది ?

జ. జీవుడు ప్రయత్న పూర్వకముగ ఆ సత్వగుణమును గూడ దాటి కేవలాత్మ స్థితిని బడయ వలెను. అదియే మోక్షము

182. రజోగుణ మెట్టిది ?

జ. దృశ్య విషయములపై ప్రీతిని గలుగ జేయునది. తృష్ణను (కోరికను) ఆసక్తిని జనింపజేయునది.

183. అది ఏ ప్రకారము జీవుని బంధించుచున్నది. ?

జ. 1. విషయాసక్తి చేతను 2. కర్మ బంధము చేతను బంధించుచున్నది.

184. కాబట్టి ఫలితాంశమేమి ?

జ. బంధకరమగు అట్టి రజో గుణమును ప్రయత్న పూర్వకముగ తొలగించు కొనవలెను.

185. సత్త్వగుణము అధికమగ ఉన్నపుడు జీవుడెట్లుండును ?

జ. అతని సమస్త ఇంద్రియ ద్వారముల నుండి ప్రకాశరూపమగు జ్ఞానము సాత్వికము వెల్లివిరియు చుండును. అట్టి స్థితియెవని కైన ఉండినచో సత్త్వగుణ మతనియందు అభివృద్ధి నొంది యున్నదని గ్రహింపవచ్చును.

186. రజో గుణము అభివృద్ధినొంది యున్నపుడు జీవుడు ఎట్లుండును ?

జ. అతడు 1. లోభత్వము 2. కార్యము లందు ప్రవృత్తి 3. కర్మలను ప్రారంభించుట 4. మనశ్శాంతి లేకుండుట 5. విషయాశ అను వీనిని కలిగి యుండును. కనుక ఈ గుణము లెవరి యందుండునో వానియందు రజోగుణము అధికముగ నున్నదని గుర్తింప వచ్చును.

187. శాంతి ఎవరికి లభించును ?

జ. రజో గుణము, తమో గుణము తొలగిన వారికి.

188. తమోగుణము అభివృద్ధి నొంది యున్నపుడు జీవుడెట్లుండును ?

జ. 1. అవివేకము 2. సోమరితనము 3. అజాగ్రత్త 4. అజ్ఞానము మున్నగు లక్షణములు అతనియందు గోచరించును.

189. సత్త్వగుణము అధికముగ నుండగ మరణించు వాడెట్టి లోకము బొందును ?

జ. ఉత్తమ జ్ఞానవంతుల యొక్క పవిత్ర లోకముల అతడు పొందును.

190. రజోగుణాధిక్యత గలిగి మరణించు వాడెచ్చోట జన్మించును ?

జ. కర్మాసక్తులందు

191. తమోగుణాధిక్యత గలిగి మరణించు వాడెచ్చోట జన్మించును ?

జ. పామరుల గర్భములందు, లేక పశుపక్ష్యాది నీచజాతులందు.

192. సాత్విక కర్మలకు ఫలమేమి ?

జ. నిర్మల సుఖము.

193. రాజస కర్మలకు ఫలమేమి ?

జ. అజ్ఞానము.

194. దుఃఖము తొలుగుటకు, సుఖము ప్రాప్తించుటకు ఉపాయమేమి ?

జ. రాజసిక, తామసిక కార్యములను త్యజించి సాత్త్విక కార్యములనే ఆశ్రయించవలెను.

195. సత్త్వగుణము వలన ఏమి కలుగును ?

జ. జ్ఞానము.

196. సత్త్వగుణము కలవారు మరణానంతరము ఏ లోకమునకు పోవుదురు ?

జ. ఊర్ధ్వలోకములకు.

197. రజోగుణము కలవారు ఏ లోకమునకు పోవుదురు ?

జ. మధ్యమగు మనుష్య లోకమునకు.

198. తమోగుణము కలవారు ఏ లోకమునకు పోవుదురు ?

జ. అధోలోకమునకు.

199. జీవుడు చేయు సమస్త కార్యములకు వాస్తవముగ కర్త ఎవరు ?

జ. త్రిగుణములు (త్రిగుణాత్మకమగు మనస్సు)

200. మనుజుడు తాను వాస్తవముగ నెట్టివాడు ?

జ. అకర్త, సర్వసాక్షి, నిర్గుణుడు

201. దేహము వచ్చినందువలన నష్టమేమి ?

జ. ముసలితనము, రోగము, చావు, వియోగము, దుఃఖము మున్నగునవి అన్నియు ఆ దేహము వలననే సంభవించుట వలన అది మహా అనర్థదాయకమై యున్నది. కావున దేహరహిత (జనన, మరణ రహిత) ఆత్మస్థితినే జీవుడు పొందవలెను.

202. సంసార వృక్ష మెట్టిదో వర్ణింపుము ?

జ. 1. అది వ్రేళ్ళుపైనను, కొమ్మలు క్రిందును గలది 2. నాశము లేనిది 3. వేదమనే ఆకులు గలది.

203. వేదార్థము నెరింగిన వాడెవడు ?

జ. పరమాత్మ నుండియే జగత్తు ఆవిర్భవించినదని తెలుసు కొనువాడు, ఈ జగత్తునకు ఆధారము పరమాత్మయే అని నిశ్చయించిన వాడు వేదార్థము నెరింగిన వాడు.

204. సంసార వృక్షము ఏ ప్రకారముగ నున్నది. ?

జ. బాగుగ వ్రేళ్ళు తన్నుకొని యున్నది.

205. దానిని ఛేదించు టెట్లు ?

జ. "అసంగము" (ప్రాపంచిక పదార్థములందు ఆసక్తి, అభిమానము లేకుండుట) అను బలమైన ఖడ్గముచే అది ఛేదించి వేయబడును.

206. సంసార వృక్షమును ఛేదించిన పిదప ఏమి చేయవలెను ?

జ. పరమాత్మ పదమును అన్వేషింప వలెను.

207. పరమాత్మ పదమెట్టిది ?

జ. అవ్యయమైనది, నాశరహితమైనది.

208. జీవుడు వాస్తవముగ ఎట్టివాడు ?

జ. భగవదంశ స్వరూపుడు, సనాతనుడు (నిత్యుడు)

209. జీవి అజ్ఞాన వశమున ఏమి యొనర్చు చున్నాడు ?

జ. తాను ఉపాధినని తలంచి, ఇంద్రియాదుల తోను, మనస్సుతోను, గూడి కాలక్షేపము చేయుచున్నాడు.

210. శరీరము విడివడినపుడు గాని క్రొత్త శరీరమును గ్రహించునపుడు గాని జీవుడు తనతో ఏయే వస్తువులను తీసికొని పోవును ?

జ. మనస్సును, ఇంద్రియములను వానివాని యందుండు సంస్కారములను గైకొని పోవును.

211. జీవుడు (జీవాత్మ) ఏయే ఇంద్రియములను ఆశ్రయించి విషయములను అనుభవించుచున్నాడు ?

జ. చెవి, ముక్కు, కన్ను, చర్మము, నాలుక - అను పంచజ్ఞానేంద్రియములను, మనస్సును ఆశ్రయించి విషయములను అనుభవించుచున్నాడు.

212. సూర్యచంద్రాగ్నుల యందలి తేజస్సు ఎట్టిది ?

జ. పరమాత్మ సంబంధ మైనది. దైవమునకు జెందినది.

213. భగవానుడు ఏ ప్రకారముగ ప్రజలకు మేలొనర్చు చున్నాడు ?

జ. భూమియందు ప్రవేశించి బలముచే సమస్త ప్రాణులను భరించు చున్నాడు. చంద్రుడయి సస్యము లన్నిటిని పోషించుచున్నాడు.

214. జీవులు పరమాత్మకు ఏమి చేయవలెను ?

జ. కృతజ్ఞులై వర్తించుచు, సంకీర్తన, జప, పూజాదులచే నిరంతరము పరమాత్మను స్మరించుచుండవలెను.

215. పరమాత్మ జీవుల శరీరములందు ఏ రూపమున వెలయుచున్నాడు?

జ. (వైశ్వానరుడను) జఠరాగ్ని రూపమున.

216. అట్లుండి అతనేమి చేయుచున్నాడు ?

జ. ప్రాణ, అపానవాయువులతో గూడి జీవులు భుజించు ఆహారమును పచన మొనర్చుచున్నాడు.

217. కాబట్టి జనులు ఏమి చేయవలెను ?

జ. తమ శరీరములోనే వెలయుచున్నట్టి ఆ పరమాత్మను భక్తితో ధ్యానించుచు తాము భుజించుటకు ముందుగ అతనికి అర్పించి దైవభావనతో భుజించవలెను.

218. ఈ ప్రపంచమున పురుషులెందరు కలరు ? వారెవరు ?

జ. ఇరువురు కలరు. 1. క్షరుడు 2. అక్షరుడు

219. అందు క్షర పురుషుడు ఎవరు ?

జ. కూటస్థుడగు జీవుడు (మనస్సు యొక్క అభిమాని)

220. ఈ క్షరాక్షరముల కంటే వేరైన వాడు ఎవరైన కలరా ?

జ. కలడు, అతడే ఉత్తమ పురుషుడు.

221. అతడు ఎట్టివాడు ?

జ. ముల్లోకము లందును ప్రవేశించి వానిని భరించువాడు, జగన్నియామకుడు, నాశరహితుడు.

222. భగవానుని పూర్ణమనస్సుతో ఎవరు సేవించెదరు ?

జ. ఎవడు అజ్ఞాన రహితుడై (పైన తెలిపిన ప్రకారముగ) భగవానుని క్షరాక్షర పురుషుల కంటె అతీతుడగు పురుషోత్తమునిగ ఎరుగునో అట్టివాడు పూర్ణ మనస్సుతో అతనిని సేవించును, ధ్యానించును.

223. భగవంతుని ఏ ప్రకారము భజించ వలెను ?

జ. అచంచల భక్తితో పరిపూర్ణ మనస్సుతో భజించవలెను.

224. భగవానుడు బోధించిన ఈ ఆధ్యాత్మ శాస్త్ర మెట్టిది ?

జ. అతి రహస్యమైనది.

225. దానిని అర్జునునికే ఏల బోధించెను ?

జ. అతడు పాప రహితుడు (అనఘుడు) కనుక.

226. ఈ బోధనెరుగుట వలన ఫలితమేమి ?

జ. దానిని ఎరుగుట వలన మనుజుడు (జ్ఞానవంతుడు) కృతకృత్యుడు కాగలడు.

227. ఆసుర గుణము లెన్ని చెప్పబడెను ? అవి ఏవి ?

జ. ఆరు. అవి క్రమముగ 1. డంబము 2. గర్వము 3. అభిమానము 4. కోపము 5. కాఠిన్యము 6. అవివేకము అనునవి అయి ఉన్నవి. ఈ దుర్గుణములే ఆసురీ సంపద అనబడును.

228. ఈ దుర్గుణములను ఏమి చేయవలెను ?

జ. తప్పక త్యజించవలెను.

229. ఆసుర సంపద యొక్క ఫలమేమి ?

జ. బంధము.

230. బంధము దేనివలన కలుగుచున్నది ?

జ. ఆసుర గుణము కలిగియుండుట వలన.

231. అర్జునుడు ఎట్టి సంపద యందు జన్మించెను ?

జ. దైవీ సంపద యందు.

232. ప్రపంచమున దుఃఖమును పోగొట్టుకొనగల వాడెవడు ?

జ. దైవ గుణములు గలవాడు.

233. కామ మెట్టిది ?

జ. పూరింప శక్యము గానిది.

234. ఆసుర గుణములు కలవారికి దైవవిద్వేషులకు ఎట్టి ఫలితము లభించును ?

జ. వారు దైవనియతిచే అసుర సంబంధమైన నీచ జన్మలనే మరల మరల పుట్టుచుందురు. అనగా క్రిమి కీటకాది రాక్షసాది హీన జన్మలందే వారు జన్మించి నానాయాతనలు అనుభవించుదురు. భగవానుడే వారలను ఆయా జన్మలందు విసిరి వేయును.

235. దైవశాసనము ఎంత కాలముండును ?

జ. ఎల్లపుడు ఉండును.

236. జీవుడు కడతేరుటకు మార్గమేమి ?

జ. "ఆసుర సంపదను" (దుర్గుణములను, దురాచారములను) వదలి దైవ సంపద (సద్గుణములను, సదాచారములను) పరిగ్రహించ వలెను.

237. నరకమునకు ఎన్ని ద్వారములు ? అవి ఏవి ?

జ. మూడు అవి క్రమముగ 1. కామము, 2. క్రోధము, 3. లోభము అనునవి.

238. ఆ కామాదుల వలన జీవునకు కలుగు హాని యేమి ?

జ. అవి అతనిని నశింపజేయును.

239. శ్రేయము అభిలషించు వాడేమి చేయవలెను ?

జ. ఆ మూడు దుర్గుణములను త్యజించవలెను.

240. మనుజుడు తన అనుష్ఠానము నందు ఏ ప్రకారము ప్రవర్తించ వలెను ?

జ. శాస్త్ర విధి ననుసరించి ప్రవర్తించ వలెను.

241. శ్రద్ధ యెన్ని విధములు ? అవి ఏవి ?

జ. మూడు విధములు - అవి క్రమముగ 1. సాత్త్విక శ్రద్ధ 2. రాజసిక శ్రద్ధ 3. తామసిక శ్రద్ధ అని చెప్పబడెను.

242. అట్టి శ్రద్ధ జీవులకెట్లు జనియించును ?

జ. స్వభావముచే గాని, అనగా జన్మాంతర సంస్కార ప్రాబల్యము వలన లేక ఇహజన్మ ప్రయత్నాతిశయమున, సహజముగనే అది జనించునని భావము.

243. జీవులకు ఎట్టి శ్రద్ధ కలుగుచున్నది. ?

జ. వారి అంతః కరణ మెట్లుండునో దాని కనుగుణమగు శ్రద్ధయే కలుగుచున్నది.

244. మనుజుడు దేనిచే పరిపూర్ణుడై ఉండును ?

జ. శ్రద్ధచే

245. వాచిక తపస్సు అనగా నేమి ?

జ. పరులకు నొప్పి గలుగ జేయనదియు, సత్యమైనదియు ప్రియముగను హితముగనుండు నదియునగు వాక్కున్ను వేదాదుల అధ్యయనమున్ను వాచిక తపస్సని చెప్పబడును.

246. మానసిక తపస్సు అనగా నేమి ?

జ. 1. మనస్సు నిర్మలముగ నుండుట. 2. ముఖమందు ప్రసన్నత్వము గలిగియుండుట 3. మౌనము (ఆత్మను గూర్చిన మననము లేక దృశ్య వృత్తి రాహిత్య పూర్వకమగు ఆత్మస్థితి) అనునవి మానసిక తపస్సని చెప్పబడును.

247. సాత్త్విక దానమనగా నెట్టిది ?

జ. ప్రత్యుపకారము చేయలేని వారికి, దీనులకు, అసహాయులకు, దేశకాల పాత్రతలను జూచి చేయబడు దానమును సాత్త్విక దానమని చెప్పబడును.

248. రాజస దాన మెట్టిది. ?

జ. 1. ప్రత్యుపకారము కొరకు గాని 2. ఫలము కొరకు గాని 3. మనస్సునందు బాధపడుచు గాని చేయబడు దానము రాజస దాన మనబడును.

249. తామస దాన మెట్టిది. ?

జ. 1. దేశకాల పాత్రలు చూడకుండ చేయబడునదియు 2. సత్కార పూర్వకముగ చేయబడనిదియు 3. తిరస్కార భావముతో చేయబడునదియు అగుదనము తామస దాన మనబడును.

250. పరబ్రహ్మమునకు ఎన్ని పేర్లు గలవు ? అవి ఏవి ?

జ. మూడు పేర్లు కలవు. అవి క్రమముగ 1. ఓమ్ 2. తత్ 3. సత్ అని చెప్పబడును.

251. పరబ్రహ్మము యొక్క మహత్తు ఎట్టిది ?

జ. పరబ్రహ్మము నుండియే (లేక వాని నామోచ్చారణ చేతనే) పూర్వము 1. బ్రాహ్మణులు (బ్రహ్మజ్ఞానులు) 2. వేదములు 3. యజ్ఞములు సృష్టించబడినవి.

252. కావున బ్రహ్మ జ్ఞానులు, వేదములు, యజ్ఞములు - వీనికి మూలమేమి ?

జ. ఓంకారమే. పరబ్రహ్మమే.

253. ఓంకారము యొక్క మహిమ తెలుపుము ?

జ. వేద వేత్తలు తామాచరించు యజ్ఞ, దాన, తపః క్రియలకు మొదట ఎల్లపుడును ఓంకారమును ఉచ్చరించియే పిమ్మట ఆయా క్రియలను చేయుచుందురు.

254. యజ్ఞదాన తపంబులందలి నిష్ఠను భగవత్ప్రీత్యర్థ కర్మను పెద్దలు ఏమందురు?

జ. పరబ్రహ్మ వాచకమగు "సత్" అని అందురు. (అనగా అవి దైవరూపములే అని భావము).

255. అశ్రద్ధతో చేయబడు తపోయజ్ఞ దానాది కర్మలెట్టి ఫలితమును కలుగజేయును?

జ. ఏ ఫలమును కలుగ జేయవు. అవి నిష్ఫలములే యగును. అవి చేయని వానితో సమానమగును.

256. సన్యాసమనగా నేమి ?

జ. కామ్య కర్మలను వదులుటయే సన్యాసము.

257. త్యాగ మనగా నేమి ?

జ. సమస్త కర్మల యొక్క ఫలమును వదులుటయే త్యాగము.

258. త్యాగమెన్ని విధములని భగవానుడు తెలియజేసిరి ?

జ. మూడు విధములని

259. సాత్త్విక త్యాగము యొక్క లక్షణము లెవ్వి ?

జ. శాస్త్రనియతమగు కర్మను, 'ఇది తప్పక చేయవలెను' అని యెంచి ఫలమును, సంగమును (ఆసక్తిని) వదలివైచి చేయుట సాత్త్విక దాన మనబడును.

260. కర్మలను పూర్తిగ విడుచుట సాధ్యమా ?

జ. దేహధారియగు జీవునకు అది సాధ్యపడదు.

261. కర్మఫలము ఎన్ని విధములు ? అవి ఏవి ?

జ. మూడు విధములు, 1. ఇష్టమైనది (సుఖకరమైన స్వర్గాదులు), 2. అయిష్టమైనది (దుఃఖకరమగు నరక నీచ జన్మాదులు), 3. ఇష్టా నిష్ట మిశ్రమమైనది (సుఖము దుఃఖములు రెండును గల మానవ జన్మ)

262. ఈ కర్మఫలములు ఎవరికి అంటవు ?

జ. కర్మ ఫలములు త్యజించి కర్మనాచరించు వారికి అనగా నిష్కామ కర్మాచరణ పరులకు కలుగవు. (వారికి చిత్తశుద్ధి ద్వారా మోక్షమే లభించును గావున)

263. ఏ కర్మ అయినను జరుగవలెనన్న దానికి గల ఐదు కారణములు ఏవి ?

జ. 1. శరీరము 2. కర్త 3. వివిధములగు ఇంద్రియములు 4. ఆ ఇంద్రియముల యొక్క వ్యాపారములు 5. దైవము.

264. ఆత్మను ఎవరు చూడగలరు ? ఎవరు చూడలేరు ?

జ. జ్ఞాన నేత్రము గలవారు చూడగలరు. అది లేనివారు చూడలేరు. (జ్ఞాన నేత్రము ఆత్మానాత్మ వివేకము)

265. సాత్త్విక కర్త యొక్క లక్షణములెవ్వి ?

జ. 1. సంగము విడుచుట 2. నేను కర్తనను అహంభావము లేకుండుట 3. ధైర్యోత్సాహములు గలిగి యుండుట 4. కార్యము సఫలమైనను విఫలమైనను ఏ విధమైన వికారము చెందకుండుట.

266. తామస కర్త ఎట్టివాడు ?

జ. 1. మనో నిగ్రహము (చిత్తైకాగ్రత) లేనివాడు 2. పామరుడు 3. మొద్దు 4. వినయము లేనివాడు 5. మోసగాడు, 6. ఇతరుల కార్యములను

చెడగొట్టువాడు 7. సోమరి 8. ఎల్లప్పుడు ఏదియో చింతతో, దుఃఖముతో గూడి యుండెడివాడు 9. పనులను తెమల్చక దీర్ఘకాలము కొనసాగించు వాడిని తామస కర్త అనబడును.

267. సాత్త్విక బుద్ధి యెట్టిది ?

జ. ధర్మ ప్రవృత్తిని (ప్రకృతి మార్గమును), చేయదగిన దానిని, చేయదగని దానిని, భయము, అభయమును, బంధమును, మోక్షమును - వీనిని చక్కగా తెలిసి కొనగల బుద్ధియే సాత్త్విక బుద్ధి అనబడును.

268. రాజస బుద్ధి ఎట్టిది ?

జ. ధర్మమును, అధర్మమును, కర్తవ్యమును, అకర్తవ్యమును ఉన్నది ఉన్నట్లుగా గాక పొరబాటుగ తెలిసికొను బుద్ధి రాజస బుద్ధియై ఉన్నది.

269. తామస బుద్ధి ఎట్టిది ?

జ. అవివేకముచే గప్పబడినదై, అధర్మమును ధర్మముగను, సమస్త పదార్థములను గ్రహించు నట్టి బుద్ధి తామసబుద్ధియై ఉన్నది.

270. సాత్త్విక ధైర్య మెట్టిది ?

జ. నిశ్చలమైన ధైర్యముతో గూడి యోగ సాధనచే మనుజుడు ఇంద్రియాలను విషయముల నుండి నిరోధింప గల్గునో అట్టి ధైర్యమును సాత్త్విక ధైర్యమని చెప్పబడును.

271. రాజస ధైర్య మెట్టిది ?

జ. ఏ ధైర్యముచే మనుజుడు ఫలాపేక్ష గలవాడై ధర్మార్థ కామములను మిగుల ఆసక్తితో అనుష్ఠించు చుండునో అయ్యది రాజస ధైర్యము అనబడును.

272. తామస ధైర్య మెట్టిది ?

జ. ఏ ధైర్యముచే దుర్బుద్ధి గలవాడై నిద్రను, భయమును, శోకమును, దిగులును, మదమును, విడువక ఉండునో అది తామస ధైర్యమని చెప్పబడును.

273. సుఖములెన్ని రకములు ?

జ. మూడు రకములు 1. సాత్త్విక సుఖము 2. రాజస సుఖము, 3. తామస సుఖము.

274. దుఃఖ రాహిత్యము ఎట్లు కలుగును ?

జ. అభ్యాసము ద్వారా సాత్త్విక సుఖమును బొందుటచే దుఃఖము సంపూర్ణముగ తొలగింప పోగలదు.

275. సాత్త్విక సుఖము యొక్క లక్షణమేమి ?

జ. ప్రారంభములో విషము వలె కష్టముగ తోచి తుదకు అమృతము వలె సుఖదాయకముగ ఉండునది సాత్విక సుఖము.

276. అట్టి సాత్త్విక సుఖము జీవున కెట్లు కలుగును ?

జ. నిర్మల బుద్ధి నుండి ఆ సుఖము జనియించును. కావున సుఖాభిలాషి బుద్ధిని, నిర్మల మొనర్చుకొనవలెను.

277. జీవుని కర్తవ్యమేమి ?

జ. ఆధ్యాత్మిక సాధనలు గావించునపుడు కలుగు కష్టములకు జంకక భగవంతునిపై పూర్ణ విశ్వాసముంచి, సాధనను ధైర్యముతో కొనసాగించి బుద్ధియందు విషయదోషమెద్దియు లేకుండ అద్దానిని సునిర్మలము గావించవలెను. మహత్తరమగు ఆత్మసుఖ మాతనికి అనుభూతము కాగలదు.

278. రాజస సుఖము యొక్క లక్షణమేమి ?

జ. మొదట అమృతము వలె మహాసుఖముగ కానుపించి తుట్టతుదకు విషమువలె దారుణ దుఃఖ రూపముగ పరిణమించుటయే రాజస సుఖలక్షణము.

279. తామస సుఖము యొక్క లక్షణమేమి ?

జ. 1. నిద్ర, సోమరితనము, ప్రమత్తత వీనివలన కలుగు నదియు 2. ఆరంభమున అంతమున గూడ మోహమును గలుగ జేయునదియు తామస సుఖము అనబడును.

280. బ్రాహ్మణాది వర్ణములు దేనిచే నేర్పడినవి ?

జ. వారి వారి గుణములచే.

281. చాతుర్వర్ణముల వారికి కర్మలు ఏ ప్రకారముగ విభజింప బడినవి ?

జ. వారి వారి (జన్మాంతర సంస్కారము) ననుసరించిన స్వభావముల వలన పుట్టిన గుణములను బట్టి ఆయా కర్మలు వారికి విభజింప బడినవి.

282. దైవ సంపద యొక్క ఫలమేమి ?

జ. మోక్షము, బంధనివృత్తి

283. ఏ ఏ కర్మలు బ్రాహ్మణులకు స్వభావముగ ఉండును ?

జ. 1. మనో నిగ్రహము 2. బాహ్యేంద్రియ నిగ్రహము 3. తపస్సు 4. శుచిత్వము 5. ఓర్పు 6. ఋజువర్తన 7. శాస్త్ర జ్ఞానము 8. అనుభవ జ్ఞానము 9. ఆస్తిక భావము (దేవుని యందు, గురువు నందు, శాస్త్రము నందు విశ్వాసము) అను ఈ తొమ్మిది కర్మలున్ను బ్రాహ్మణులకు స్వభావముగ నుండును, లేక ఇవి కలవాడే బ్రాహ్మణుడు అనబడును.

284. క్షత్రియుని స్వభావ జనిత కర్మలేవి ?

జ. 1. శూరత్వము, 2. తేజస్సు, (కీర్తి ప్రతాపము), 3. ధైర్యము, 4. సామర్థ్యము, 5.యుద్ధము లందు వెనుకకు మరల కుండుట 6. దానము 7. ప్రజాపరిపాలనశక్తి, ఇవి క్షత్రియుని కర్మములు.

285. వైశ్యుని స్వభావ జనిత కర్మ లేవి ?

జ. 1. వ్యవసాయము, 2. గో సంరక్షణము 3. వర్తకము.

286. శూద్రుని స్వాభావిక కర్మలేవి ?

జ. సేవ.

287. జీవునకు ఏ కర్మము, ఏ ధర్మము శ్రేష్ఠమైనది ?

జ. స్వధర్మ సంబంధ కర్మమే శ్రేష్ఠమైనది.

288. కర్మచే మోక్షము నెట్లు పొందవచ్చును. ?

జ. ఫలత్యాగ పూర్వకముగ కర్మలను చేయుట వలన చిత్తము శుద్ధమగుట చేతను, మనో నిగ్రహము నభ్యసించుట చేతను జీవుడు క్రమముగ మోక్ష స్థితిని పొందగల్గుచున్నాడు.

289. కర్మనెపుడు చేయవలెను ?

జ. శాస్త్ర మెట్లున్నదో తెలిసికొని ఆ పిదప చేయవలెను.

290. భక్తి పూర్వక నిష్కామ కర్మాచారణచే ఏమి లభించును ?

జ. భగవదనుగ్రహము, అట్టి అనుగ్రహముచే మోక్షము లభించును.

291. భగవద్వాక్యములను విననిచో వారిగతి ఏమగును ?

జ. వారు చెడి పోవుదురు. సంసార దుఃఖములపాల్పడుదురు.

292. శోక రాహిత్యమునకు మార్గమేమి ?

జ. భగవచ్ఛరణాగతియే. దైవాశ్రయమే శోక రాహిత్యమునకు మార్గము.

293. గీతాశాస్త్రము ఎవరికి ఉపదేశింప రాదు ?

జ. 1. తపస్సు లేని వారికి 2. భక్తి లేనివారికి 3. శుశ్రూష చేయని వారికి 4. భగవంతుని నిందించు వారికి ఉపదేశించరాదు.

294. గీతా శాస్త్రము ఎవరికి భోదించవలెను ?

జ. భగవద్భక్తులకు.

295. గీతాశాస్త్రము అధ్యయనము చేసినవాడు ఏ యజ్ఞమును ఆచరించిన వాడగును?

జ. జ్ఞాన యజ్ఞము

296. గీతా శాస్త్రము బోధించు వారికి కలుగు ఫలితమేమి ?

జ. వారు పరాభక్తి కలవారై సంశయ రహితులై భగవంతునే పొందుదురు. భగవంతునకు ప్రియులగుదురు.

297. కృష్ణుని బోధచే అర్జునునకు ఎట్టి సత్ఫలితములు గలిగినవి ?

జ. అతనికి 1. అజ్ఞానము తొలిగినది, 2. ఆత్మస్మృతి కలిగినది. 3. సంశయములు పటా పంచలైనవి, 4. అతడు కర్తవ్య పరాయణుడు కాగల్గెను.

298. ఈ గీతా శాస్త్రము సంజయుడు నేరుగా ఎట్లు వినగల్గెను. ?

జ. శ్రీవ్యాస మహర్షి అనుగ్రహముచే.

299. శ్రీ కృష్ణార్జున సంవాద రూపమగు ఈ గీతా శాస్త్ర మెట్టిది ?

జ. 1. మహా పుణ్యప్రదమైనది - అతి పావనమైనది, 2. అద్భుతమైనది - మహదాశ్చర్యకరమైనది.

300. అట్టి గీతా శాస్త్రము వినిన పిదప ఏమి చేయవలెను ?

జ. ఆ వినిన అర్థమును మాటి మాటికి మననమును చేయవలెను. నిధి ధ్యాసనము గావింపవలెను.

301. అట్లు చేసినందు వలన ఏమి ఫలితము చేకూరును ?

జ. జీవుడు దుఃఖ రహితుడై, అతి హర్షమును, ఆత్మానందమును బొందును. మాటిమాటికి సంతోషార్ణవమున ఓల లాడుచుందును. సంజయుడే ఇందులకు దృష్టాంతము.

**సర్వేజనాః సుఖినోభవన్తు**



సంకలనము - సమర్పణము

శ్రీమతి పూల సుజాతా ఆంజనేయులు

"శ్రీ సాయికృప"

31-9-8/12, మారుతీనగర్, విజయవాడ-520 004. ఫోన్: 0866-243 4788